తప్పిదాలకు తావుండొద్దు

- పథకాల లబ్ధిదారుల ఎంపిక సర్వే పకడ్బందీగా జరగాలి
- అధికారుల సమీక్ష సమావేశంలో కలెక్టర్ వీపీ గౌతమ్

మామిళ్లగూడెం, ఫిబ్రవరి 14: గృహజ్యోతి పథకంలో భాగంగా గ్యాస్ సిలిండర్ లబ్ధిదారుల ఎంపికకు జరుగుతున్న సర్వేలో తప్పిదాలు, పొరపాట్లకు తావు ఉండకుండా చూడాలని కలెక్టర్ వీపీ గౌతమ్ ఆదేశించారు. ఖమ్మంలోని కలెక్టరేట్‌లో బుధవారం పంచాయతీరాజ్, పౌర సరఫరాల అధికారులతో నిర్వహించిన సమీక్షలో ఆయన మాట్లాడారు. లబ్ధిదారుల నుంచి సేకరించే ఆధారాలు పక్కాగా ఉండాలన్నారు. అనంతరం కలెక్టర్ ఈవీఎం గోడౌన్‌లో చేపడుతున్న మాక్ పోలింగ్ ప్రక్రియను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో ఈవీఎంల ఫస్ట్ లెవల్ తనిఖీ పూర్తి చేశామన్నారు. తర్వాత ఈవీఎంల పని తీరుపై మాక్ పోల్ నిర్వహించామన్నారు. కలెక్టర్ వెంట అదనపు కలెక్టర్ డి.మధుసూదన్‌నాయక్, కలెక్టరేట్ సూపరింటెండెంట్ మదన్‌గోపాల్, ఎన్నికల సూపరింటెండెంట్ రాంబాబు, రాజకీయ పార్టీల ప్రతినిధులు ఉన్నారు.

పట్టభద్రుల ఓటు నమోదు మరో చాన్స్

పట్టభద్రుల ఎమ్మెల్సీ ఓటు నమోదుకు మార్చి 14 వరకు అవకాశం ఉన్నట్లు కలెక్టర్ వీపీ గౌతమ్ తెలిపారు. 2020 నవంబర్ 1లోపు డిగ్రీ పూర్తి చేసిన వారు అర్హులని చెప్పారు. ఫారం-18 ద్వారా ఓటు హక్కు కోసం దరఖాస్తు చేసుకోవచ్చన్నారు.

ఈవీఎంలను పరిశీలిస్తున్న కలెక్టర్ వీపీ గౌతమ్

ఎస్ఐగా పనిచేసిన చోటికే.. ఏసీపీగా..

కల్లూరు ఏసీపీగా అనిశెట్టి రఘు బాధ్యతల స్వీకరణ

ఏసీపీ అనిశెట్టి రఘు

సత్తుపల్లి టౌన్, ఫిబ్రవరి 14: కల్లూరు ఏసీపీగా అనిశెట్టి రఘు బుధవారం బాధ్యతలు చేపట్టారు. హైదరాబాద్ సైబర్ క్రైం ఏసీపీగా విధులు నిర్వహిస్తున్న ఈయన ఇటీవలి బదిలీల్లో ఇక్కడికి వచ్చారు. సత్తుపల్లిలోని ఏసీపీ కార్యాలయంలో చార్జ్ తీసుకున్నారు. ఇప్పటి వరకూ ఇక్కడ ఏసీపీగా పనిచేసిన రామానుజం హైదరాబాద్ డీజీ కార్యాలయానికి అటాచ్ అయ్యారు. ఈ సందర్భంగా ఆయన 'నమస్తే తెలంగాణ'తో మాట్లాడుతూ.. గతంలో తాను ఇక్కడ ఎస్సైగా పనిచేశానని, ఇప్పుడు ఏసీపీగా వచ్చానని వివరించారు.

వైరా ఎస్సైగా భాగ్యరాజ్

వైరా టౌన్: వైరా ఎస్సైగా ఎ.వంశీకృష్ణ భాగ్యరాజ్ బుధవారం విధుల్లో చేరారు.

సత్తుపల్లి మున్సిపల్ కమిషనర్ బదిలీ

సత్తుపల్లి, ఫిబ్రవరి 14: సత్తుపల్లి మున్సిపల్ కమిషనర్ సుజాత బుధవారం కామారెడ్డికి బదిలీ అయ్యారు. ఆమె స్థానంలో మేడ్చల్ జిల్లా మెప్మా పీడీ రవిబాబు ఇక్కడకు రానున్నారు. కాగా, వైరా మున్సిపల్ కమిషనర్ సీహెచ్ వేణు బుధవారం బాధ్యతలు చేపట్టారు.

తలసేమియాను అరికట్టేందుకు కృషిచేద్దాం

అవగాహన ర్యాలీని ప్రారంభిస్తున్న ఏసీపీ సుశీల్‌సింగ్

ఖమ్మం సిటీ, ఫిబ్రవరి 14: సమాజంలో ప్రమాదకరంగా మారుతున్న జన్యుపరమైన వ్యాధి తలసేమియాను అరికట్టేందుకు కృషిచేద్దామని ఏఆర్ ఏసీపీ సుశీల్‌సింగ్ చౌహాన్, ఐఎంఎ ఖమ్మం అధ్యక్షుడు డాక్టర్ కంభంపాటి నారాయణరావు పిలుపునిచ్చారు. సంకల్ప స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించిన అవగాహన ర్యాలీలో ఆయన వారు మాట్లాడారు. జిల్లా సార్వజనీన ఆసుపత్రి మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ ఎల్ కిరణ్‌కుమార్, హోంగార్డ్ ఆర్ఐ ఎం సురేష్, ఆరోగ్యశ్రీ జిల్లా కో- ఆర్డినేటర్ రావూరి మాధవరావు, డీఎం శ్రీనివాస్, డాక్టర్ డీ నారాయణమూర్తి, డాక్టర్ జితేందర్, డాక్టర్ లక్ష్మీదీప, చైల్డ్ లైన్ కో- ఆర్డినేటర్ శ్రీనివాస్, సంకల్ప స్వచ్ఛంద సంస్థ ఉపాధ్యక్షురాలు పీ పావని, వివిధ సంస్థల బాధ్యులు బోస్ యాదవ్, అనురాధ, పీ రవి, ఉదయ్ భాస్కర్, అనిత, వంశీ కిరీటి తదితరులు పాల్గొన్నారు.

విధుల్లో చేరిన మండల పరిషత్ అభివృద్ధి అధికారులు

కారేపల్లి/ వైరా టౌన్/ సత్తుపల్లి రూరల్, ఫిబ్రవరి 14: కారేపల్లి ఎంపీడీవోగా జి.సురేందర్ బుధవారం విధుల్లో చేరారు. ఆయన భూపాలపల్లి నుంచి వచ్చారు. ఇక్కడి ఎంపీడీవో ఎం.చంద్రశేఖర్ వేరే జిల్లాకు బదిలీ అయ్యారు. అలాగే, వైరా ఎంపీడీవోగా పీ.సరస్వతి బుధవారం బాధ్యతలు స్వీకరించారు. సత్తుపల్లి ఎంపీడీవోగా ఆర్‌సీహెచ్ నాగేశ్వరరావు బుధవారం పదవీ బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటి వరకూ ఇక్కడ పనిచేసిన జయరామ్ సిద్ధిపేట జిల్లా అక్కన్నపేటకు బదిలీ అయ్యారు. వైరా మున్సిపల్ కమిషనర్ సీహెచ్.వేణు విధుల్లో చేరారు.

డీసీవో బాధ్యతల స్వీకరణ

ఖమ్మం వ్యవసాయం, ఫిబ్రవరి 14: జిల్లా సహకార అధికారి (డీసీవో)గా మురళీధర్ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటివరకు ఇక్కడ జిల్లా సహకార అధికారిగా విధులు నిర్వహించిన విజయకుమారి కరీంనగర్ జిల్లాకు బదిలీ కాగా.. కాళోజీ యూనివర్సిటీ జాయింట్ రిజిస్ట్రార్‌గా విధులు నిర్వహిస్తున్న మురళీధర్ ఇక్కడకు బదిలీపై వచ్చారు.

నేటి నుంచి తిరునాళ్లు

తిరుమలాయపాలెం, ఫిబ్రవరి 14: తిరుమలాయపాలెంలోని కుసుమ హరినాథబాబా ఆలయ సన్నిధిలో గురువారం నుంచి మూడురోజుల పాటు తిరునాళ్ల జరుగనున్నది. తొలిరోజు నిర్వాహకులు ఏకనామ భజనలు, కీర్తనాలాపన వంటి కార్యక్రమాలు నిర్వహించనున్నారు. శుక్రవారం స్వామి వారి కల్యాణ మహోత్సవం జరిపించనున్నారు. ఇదే రోజు నిర్వాహకులు భక్తులకు అన్నదానం చేయనున్నారు. సాయంత్రం స్వామివారి శోభాయాత్ర చేపట్టనున్నారు.

ఉపవాస దీక్షలు ప్రారంభం

కల్లూరు/ సత్తుపల్లి రూరల్, ఫిబ్రవరి 14: కల్లూరులో లిటిల్‌ఫ్లవర్ చర్చితోపాటు మండలంలోని పలు చర్చిల్లో బుధవారం నుంచి క్రైస్తవుల ఉపవాస దీక్షలు ప్రారంభమయ్యాయి. గుడ్‌ఫ్రైడే వరకు 40 రోజులపాటు ఈ దీక్షలు జరుగుతాయని ఫాదర్ తెలిపారు. భస్మ బుధవారం సందర్భంగా సత్తుపల్లి మౌంట్‌కార్మెల్ చర్చిలో విచారణ గురువు విన్సెంట్ బుధవారం ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. 80 మంది విశ్వాసులు ఉపవాస దీక్ష చేపట్టారు.

చిన్నారులకు అక్షరాభ్యాసం

మధిర, ఫిబ్రవరి 14: మాఘమాస శుద్ధ పంచమి సందర్భంగా బుధవారం పట్టణంలోని వాసవి కన్యకాపరమేశ్వరి ఆలయంలో తల్లిదండ్రులు తమ పిల్లలకు అక్షరాభ్యాసం చేయించారు.

వసంత పంచమి వేడుకలు

సత్తుపల్లి, ఫిబ్రవరి 14: వసంత పంచమి సందర్భంగా బుధవారం పట్టణ శివారులోని శ్రీజ్ఞాన సరస్వతి ఆలయంలో చిన్నారులకు అక్షరాభ్యాసాలు నిర్వహించారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించగా చిన్నారులతో అక్షరాభ్యాసాలు, సరస్వతి పూజలు చేయించారు.

ఎరువుల దుకాణాల తనిఖీ

వైరా రూరల్, ఫిబ్రవరి 14: మండలంలోని వైరా, గొల్లపూడి, పూసలపాడులోని ఎరువులు, పురుగు మందుల దుకాణాలను జిల్లా వ్యవసాయ శాఖ అధికారి ఎం.విజయనిర్మల, అసిస్టెంట్ కలెక్టర్ మయాంక్‌సింగ్, వ్యవసాయ అధికారులు పవన్‌కుమార్, వాహిని, వీ.బాబురావు బుధవారం తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించారు.

రైతులపై దాడికి ఖండన

వైరా టౌన్, ఫిబ్రవరి 14: పంటలకు మద్దతు ధర ఇవ్వాలన్న డిమాండుతో దేశ రాజధాని ఢిల్లీలో ఆందోళనకు దిగిన రైతులపై కేంద్రంలోని మోదీ ప్రభుత్వం దాడి చేయడాన్ని ప్రజాపంథా రాష్ట్ర కార్యదర్శి పోటు రంగారావు ఖండించారు. దీనిని ప్రజలందరూ తీవ్రంగా నిరసించాలని పిలుపునిచ్చారు. వైరాలో బుధవారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. మోదీ ప్రభుత్వం నిరంకుశ, నియంతృత్వ, విచ్ఛిన్నకర విధానాలకు నిరసనగా ఈ నెల 16న జరగనున్న దేశవ్యాప్త సమ్మెను ప్రజలు జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. నాయకులు పాల్గొన్నారు.

బంద్‌కు సహకరించాలి

ఈ నెల 16న జరుగనున్న గ్రామీణ బంద్‌కు ప్రజలు సహకరించాలని తెలంగాణ రైతు సంఘం జిల్లా కార్యదర్శి బొంతు రాంబాబు కోరారు. వైరాలో బుధవారం జరిగిన సీఐటీయూ సమావేశంలో ఆయన మాట్లాడారు.

రైతు ఉద్యమానికి మద్దతు

తిరుమలాయపాలెం, ఫిబ్రవరి 14: రైతు సమస్యల పరిష్కారం కోసం ఢిల్లీలో రైతులు చేపట్టిన ఉద్యమానికి మద్దతుగా బుధవారం మండల కేంద్రం తిరుమలాయపాలెం, పిండిప్రోలు, బచ్చోడులో సీపీఎం, సీపీఐ (ఎంఎల్) ప్రజాపంథా, కాంగ్రెస్ పార్టీతో పాటు ఇతర ప్రజాసంఘాల నాయకులు నిరసన కార్యక్రమాలు చేపట్టారు. రాస్తారోకోలు నిర్వహించారు. అనంతరం పీఎం నరేంద్ర మోదీ దిష్టిబొమ్మను దహనం చేశారు.

న్యూవిజన్ విద్యార్థులకు 'ఏఎస్‌రావు' ర్యాంకులు

ప్రతిభ చూపిన విద్యార్థులతో న్యూవిజన్ పాఠశాల చైర్మన్ ప్రసాద్

ఖమ్మం ఎడ్యుకేషన్, ఫిబ్రవరి 14: తమ పాఠశాల విద్యార్థులు ఏఎస్ రావు ట్యాలెంట్ సెర్చ్ ఎగ్జామ్‌లో ఉత్తమ ర్యాంకులు సాధించినట్లు నగరంలోని న్యూవిజన్ ఒలింపియాడ్ పాఠశాల చైర్మన్ సీహెచ్‌జీకే ప్రసాద్ బుధవారం తెలిపారు. తెలుగు రాష్ట్రాల్లో ఇటీవల జరిగిన డాక్టర్ ఏఎస్‌రావు 33వ టాలెంట్ సెర్చ్ ఎగ్జామ్ ఫైనల్ లెవల్‌లో అంతర్ రాష్ట్ర స్థాయిలో తమ పాఠశాల విద్యార్థులు 1, 2, 4, 5 ర్యాంకులు సాధించినట్లు వివరించారు. ఈ సందర్భంగా ప్రతిభ చూపిన విద్యార్థులను పాఠశాలలో బుధవారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో అభినందించారు. అకడమిక్ డైరెక్టర్ సీహెచ్ కార్తీక్, ప్రిన్సిపాల్ మైఖేల్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

శ్రీచైతన్య ఇంజినీరింగ్ కళాశాలకు అరుదైన ఘనత

ఒప్పంద పత్రాలు చూపుతున్న వర్సిటీ ప్రతినిధులు, శ్రీచైతన్య బాధ్యులు

ఖమ్మం రూరల్, ఫిబ్రవరి 14: ఖమ్మం రూరల్ పరిధిలోని శ్రీచైతన్య ఇంజినీరింగ్ కళాశాల అరుదైన ఘనత సాధించింది. ఫ్రాన్స్‌కు చెందిన అయివాన్ సిటీ యూనివర్సిటీతో 'కెరీర్ అపర్చ్యునిటీ', 'ఫ్యాకల్టీ ఎంగేజ్‌మెంట్'పై బుధవారం అవగాహన ఒప్పందం కుదుర్చుకున్నది. ఈ సందర్భంగా కళాశాల ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ డాక్టర్ సాయిగీతిక, ప్రిన్సిపాల్ డాక్టర్ సన్నాల కృష్ణమూర్తి మాట్లాడుతూ.. ఈ ఒప్పందంతో తమ కళాశాలలో చదువుతున్న విద్యార్థులు ఫ్రాన్స్‌లో ఉద్యోగావకాశాలు వస్తాయని, అయివాన్ సిటీ యూనివర్సిటీ అధ్యాపకులు ఇక్కడ పాఠాలు బోధించే వెసులుబాటు కలుగుతుందని అన్నారు.

రాష్ట్రస్థాయి ఇన్‌స్పైర్‌కి 'రెజొనెన్స్' విద్యార్థి ఎంపిక

విద్యార్థిని అభినందిస్తున్న పాఠశాల డైరెక్టర్

ఖమ్మం ఎడ్యుకేషన్, ఫిబ్రవరి 14: తమ పాఠశాల విద్యార్థి రాష్ట్రస్థాయి ఇన్‌స్పైర్‌కి ఎంపికైనట్లు నగరంలోని రెజొనెన్స్ ఇన్‌ఫో స్కూల్ డైరెక్టర్ రాజా వాసిరెడ్డి నాగేంద్ర కుమార్ తెలిపారు. ఇటీవల ఆన్‌లైన్‌లో నిర్వహించిన ఇన్‌స్పైర్ జిల్లాస్థాయి ప్రదర్శనలో తమ పాఠశాల విద్యార్థి షణ్ముఖ శ్రీగోపాల్ స్మార్ట్ ర్యాంపు ప్రాజెక్టును ప్రదర్శించగా అది రాష్ట్రస్థాయికి ఎంపికైనట్లు వివరించారు. ఈ సందర్భంగా ప్రతిభ కనబర్చిన విద్యార్థిని పాఠశాల డైరెక్టర్లు కొండా శ్రీధర్‌రావు, కొలిపాక నీలిమ, ప్రిన్సిపాల్ గోపాలకృష్ణ బుధవారం అభినందించారు.

'వద్దిరాజు' ఎంపికపై 'తాతా' హర్షం..

ఖమ్మం, ఫిబ్రవరి 14: రాజ్యసభ సభ్యుడిగా మరోసారి వద్దిరాజు రవిచంద్రకు అవకాశం రావడం పట్ల ఎమ్మెల్సీ, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు తాతా మధు హర్షం వ్యక్తం చేశారు. రాజ్యసభ సభ్యుడిగా పదవీ కాలం ముగియనున్న వద్దిరాజుకు బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ మళ్లీ అవకాశం కల్పించడం మంచి పరిణామమన్నారు. గత అసెంబ్లీ ఎన్నికల్లో ఆయన ఇన్‌చార్జిగా వ్యవహరించిన నియోజకవర్గాల్లో అభ్యర్థుల గెలుపు కోసం కృషి చేశారని గుర్తు చేశారు. ఈ సందర్భంగా శుభాకాంక్షలు తెలిపారు.

'పామాయిల్ సాగుపై మెళకువలు తెలుసుకోవాలి'

పెనుబల్లి, ఫిబ్రవరి 14: పామాయిల్ పంట వల్ల రైతులు అధిక లాభాలు పొందవచ్చని ఆయిల్‌ఫెడ్ అధికారి భారతి సూచించారు. దానిలో మెళకువలు తెలుసుకుంటే ఆర్థికంగా ఎదుగుతారని అన్నారు. మండలంలోని ఉప్పలచెలక రైతువేదికలో బుధవారం జరిగిన పామాయిల్ రైతుల అవగాహన సదస్సులో ఆమె మాట్లాడారు. రైతుకు ఎల్లప్పుడూ ఆదాయాన్ని సమకూర్చేది ఆయిల్‌ఫాం పంట మాత్రమేనని వివరించారు. జడ్పీటీసీ చెక్కిలాల మోహన్‌రావు, రైతులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా పామాయిల్ క్యాలెండర్‌ను ఆవిష్కరించారు.

తపాలా శాఖ ద్వారా విభిన్న సేవలు: రవికుమార్

రఘునాథపాలెం, ఫిబ్రవరి 14: తపాల శాఖ ఆధ్వర్యంలో సేవలను విస్తృతంగా నిర్వహిస్తున్నామని ఆ శాఖ ఉమ్మడి జిల్లా సూపరింటెండెంట్ రవికుమార్ పేర్కొన్నారు. జిల్లా కేంద్రమైన ఖమ్మం గొల్లగూడెంలోని పులిపాటి నగర్-2లో డాక్టర్ పులిపాటి ప్రసాద్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన తపాలాశాఖ నూతన పోస్ట్ బాక్స్ సేవలను బుధవారం ఆయన ముఖ్య అతిథిగా ప్రారంభించారు. తమ తపాలా శాఖ కూడా విభిన్న రకాల సేవలను అందిస్తోందని, బ్యాంకింగ్ సహా దాని అనుబంధ సేవలను విస్తృతం చేస్తోందని అన్నారు. వీటిని ప్రజలు వినియోగించుకోవలని ఆకాంక్షించారు.

మల్లెల లింగమ్మకు ఎమ్మెల్యే, మాజీ ఎమ్మెల్యేల నివాళి

కారేపల్లి, ఫిబ్రవరి 14: హైదరాబాద్ యశోద్ హాస్పిటల్ డాక్టర్, మాజీ సీఎం కేసీఆర్ వ్యక్తిగత వైద్యుడు మల్లెల వెంకటేశ్వరరావు మాతృమూరి మల్లెల లింగమ్మ ఇటీవల అనారోగ్యంతో మృతిచెందారు. ఆమె స్వగ్రామమైన మండలంలోని కొత్తకమలాపురంలో బుధవారం సంతాప సభను కుమారులు నిర్వహించారు. లింగమ్మ చిత్రపటం వద్ద ఎమ్మెల్యే మాలోత్ రాందాస్‌నాయక్, మాజీ ఎమ్మెల్యేలు కందాళ ఉపేందర్‌రెడ్డి, సండ్ర వెంకటవీరయ్య, నల్లమోతు భాస్కరరావు నివాళులర్పించారు.

'శ్రమ, పట్టుదలతోనే మెరుగైన ఫలితాలు'

కారేపల్లి, ఫిబ్రవరి 14: విద్యార్థులు పట్టుదలగా శ్రమిస్తేనే మెరుగైన ఫలితాలు సాధించగలుగుతారని కేజీబీవీ ప్రత్యేకాధికారి జి.ఝాన్సీసౌజన్య అన్నారు. స్థానిక కేజీబీవీ జూనియర్ కళాశాల-పాఠశాలలో బుధవారం జరిగిన ఫేర్‌వెల్ డేలో మాట్లాడారు. విద్యార్థుల భవిష్యత్తుకు ఇంటర్ విద్య పునాదిలాంటిదని అన్నారు. ప్రణాళికాబద్ధంగా చదివితే ఎలాంటి మానసిక ఒత్తిడి, అలసట, ఆందోళన ఉండదని అన్నారు.

'బంజారాల ఆరాధ్యుడు సేవాలాల్ మహరాజ్'

రఘునాథపాలెం, ఫిబ్రవరి 14: బంజారాల సమాజాన్ని సన్మార్గంలో నడిపిన మహనీయుడు సంత్ సేవాలాల్ మహరాజ్ అని ఆర్టీఐ మాజీ కమిషనర్ జాననాయక్, ఖమ్మం ఐపీఎస్ అధికారి మౌనిక పేర్కొన్నారు. సేవాలాల్ మహరాజ్ జయంతి సందర్భంగా తనికెళ్లలోని తెలంగాణ ట్రైబల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ మహిళా కళాశాలలో బుధవారం జరిగిన వేడుకలకు వారు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. సేవాలాల్‌ను ఆదర్శంగా తీసుకొని ప్రతి ఒక్కరూ ఆయన మార్గంలో నడవాలని ఆకాంక్షించారు. ప్రిన్సిపాల్ మానస, సుమన్, వెంకన్న, గణేశ్‌నాయక్, రిటైర్డ్ ఆర్‌సీవో సత్యనారాయణ పాల్గొన్నారు.

టిప్పర్ కింద పడి యువకుడి దుర్మరణం

రఘునాథపాలెం, ఫిబ్రవరి 14: టిప్పర్ కింద పడి యువకుడు దుర్మరణం చెందిన ఘటన ఖమ్మం బల్లేపల్లి శివారు ఇల్లెందు రోడ్డులో బుధవారం ఉదయం చోటుచేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం.. రఘునాథపాలేనికి చెందిన బానోతు వీరన్న (18) ఇంటర్ చదువుతూ తల్లికి ఆర్థిక సాయంగా కూలి పనులకు వెళ్తుంటాడు. కాగా, వీరన్న బుధవారం ఉదయం తన మిత్రుడి ద్విచక్ర వాహనాన్ని తీసుకొని ఖమ్మం వస్తుండగా ఎస్ఎఫ్ఎస్ స్కూల్ వద్ద యూటర్స్ తీసుకుంటున్నాడు. ఈ క్రమంలో ప్రమాదవశాత్తూ అతడిని ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో వీరన్న టిప్పర్ కింద పడిపోవడంతో తల నుజ్జునుజ్జయింది. దీంతో అతడు అక్కడికక్కడే మృతిచెందాడు. విషయం తెలుసుకున్న మృతుడి తల్లి తులశమ్మ ఘటనా స్థలానికి చేరుకొని బోరున విలపించింది. ఖానాపురం హవేలీ పోలీసులు కూడా ఘటనా స్థలానికి చేరుకొని ఘటన వివరాలు సేకరించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ భానుప్రకాశ్ తెలిపారు.

'భట్టి' సోదరుడు మృతి.. పాడె మోసిన డిప్యూటీ సీఎం

మల్లు వెంకటేశ్వర్లు పాడె మోస్తున్న భట్టి

వైరా రూరల్, ఫిబ్రవరి 14: డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క సోదరుడైన డాక్టర్ మల్లు వెంకటేశ్వర్లు (ఆయుష్ శాఖ మాజీ అడిషనల్ డైరెక్టర్) మృతిచెందారు. స్వగ్రామమైన వైరా మండలం స్నానాల లక్ష్మీపురంలో బుధవారం అంత్యక్రియలు జరిగాయి. భౌతిక కాయానికి డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క-నందిని దంపతులు, కలెక్టర్ గౌతమ్, ఎమ్మెల్యే రాందాస్ నాయక్ తదితరులు నివాళులర్పించారు. అంతిమ యాత్రలో సోదరులైన డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, ఢిల్లీలో రాష్ట్ర ప్రభుత్వ అధికార ప్రతినిధి మల్లు రవి పాడె మోశారు. గ్రామ సమీపంలోని మామిడి తోటలోగల మల్లు ఘాట్‌లో అంత్యక్రియలు జరిగాయి. మాజీ మంత్రి సంభాని చంద్రశేఖర్, మాజీ ఎంపీలు రాజయ్య, పోరిక బలరాంనాయక్, డీసీసీ అధ్యక్షుడు పువ్వాళ్ళ దుర్గాప్రసాద్, మాజీ ఎమ్మెల్సీ పోట్ల నాగేశ్వరరావు తదితరులు హాజరయ్యారు.

సంక్షిప్తం

చిన్నారులకు విటమిన్-ఏ ద్రావణం

ద్రావణాన్ని తాపిస్తున్న ఆరోగ్య సిబ్బంది

ఎర్రుపాలెం/ మధిర రూరల్, ఫిబ్రవరి 14: దెందుకూరు పీహెచ్‌సీ వైద్యాధికారి పృథ్వీరాజ్ ఆధ్వర్యంలో బుధవారం వైద్యసిబ్బంది 9 నెలల నుంచి 5 ఏళ్ల లోపు చిన్నారులకు రేపీకటి రాకుండా అంగన్‌వాడీ కేంద్రాల్లో విటమిన్-ఏ ద్రావణాన్ని తాగించారు. అలాగే ఎర్రుపాలెం మండలంలోని బనిగండ్లపాడు అంగన్‌వాడీ కేంద్రంలో పీహెచ్‌సీ వైద్యాధికారి శశిపూర్ణ ఆధ్వర్యంలో వైద్యసిబ్బంది చిన్నారులు విటమిన్-ఏ ద్రావణం తాగించారు.

శతాధిక వృద్ధురాలు మృతి

సుబ్బమ్మ (ఫైల్)

కల్లూరు, ఫిబ్రవరి 14: మండలంలోని పెద్దకోరుకొండి గ్రామానికి చెందిన పైదల సుబ్బమ్మ (105) బుధవారం మధ్యాహ్నం ఆమె స్వగృహంలో మృతిచెందింది. ఆమె పెద్దకోరుకొండి మత్స్యసహకార సంఘంలో సభ్యురాలిగా ఉంది. సుబ్బమ్మ భౌతికకాయాన్ని మాజీ సర్పంచ్ వేము రత్తమ్మ, జిల్లా మత్స్యసొసైటీ మాజీ చైర్మన్ మర్సకట్ల బాలరాజు, ప్రముఖ వైద్యులు వేము గంగరాజు సందర్శించి నివాళులర్పించారు.

'రేపటి భారత్‌బంద్‌ను జయప్రదం చేయండి'

పెనుబల్లి/ సత్తుపల్లి రూరల్, ఫిబ్రవరి 14: దేశ వ్యాప్తంగా కార్మికులు, రైతులు, ప్రజల హక్కులను కాలరాస్తున్న కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం నియంతృత్వానికి వ్యతిరేకంగా ఈ నెల 16న చేపట్టిన దేశ వ్యాప్త బంద్ జయప్రదం చేయాలని సీపీఐ పెనుబల్లి మండల కార్యదర్శి కొమ్మినేని సుధాకర్ కోరారు. పెనుబల్లిలో బుధవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. సత్తుపల్లి జరిగిన సమావేశంలోనూ అఖిలపక్ష నాయకులు నిమ్మటూరి రామకృష్ణ, తడికమళ్ల యోబులు మాట్లాడుతూ కార్మికులందరూ సమ్మెలో పాల్గొనాలని కోరారు.

సీఐ రమేశ్‌కు బీఆర్ఎస్ నేతల శుభాకాంక్షలు

బొకే ఇస్తున్న బీఆర్ఎస్ నేత

ఖమ్మం, ఫిబ్రవరి 14: ఖమ్మం త్రీటౌన్ సీఐగా బాధ్యతలు స్వీకరించిన దోమల రమేశ్‌ను బుధవారం పోలీస్‌స్టేషన్‌లో బీఆర్ఎస్ యువజన విభాగ పట్టణ ప్రధాన కార్యదర్శి, పార్టీ త్రీ టౌన్ అధ్యక్షుడు మాటేటి కిరణ్‌కుమార్ మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

రేషన్ బియ్యం పట్టివేత.. ఆటో సీజ్.. డ్రైవర్‌పై కేసు..


ఆటోలో పట్టుబడిన రేషన్ బియ్యం

రఘునాథపాలెం, ఫిబ్రవరి 14 : ప్రజాపంపిణీకి చెందిన రేషన్ బియ్యాన్ని అక్రమంగా తరలిస్తుండగా రఘునాథపాలెం పోలీసులు బుధవారం దాడిచేసి పట్టుకున్నారు. చింతగుర్తి గ్రామానికి చెందిన రేషన్ డీలర్ మంగతాయి ఓ ఆటోలో బియ్యాన్ని తరలిస్తున్నట్లు అందిన సమాచారం మేరకు పోలీసులు దాడి చేసి పట్టుకున్నారు. ఆటోను సీజ్ చేసి డీలర్‌తోపాటు డ్రైవర్ కృష్ణపై కేసు నమోదు చేసినట్లు సీఐ శ్రీహరి తెలిపారు.

ఉచిత కుట్టు శిక్షణ కేంద్రం ప్రారంభం

ఖమ్మం, ఫిబ్రవరి 14: సత్యమార్గం ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఖమ్మం 30వ డివిజన్‌లో ఏర్పాటు చేసిన ఉచిత కుట్టు శిక్షణ కేంద్రాన్ని బుధవారం కాంగ్రెస్ నాయకుడు సాదు రమేశ్‌రెడ్డి ప్రారంభించారు.

మదర్సా వార్షికోత్సవ పోస్టర్ ఆవిష్కరణ

వార్షికోత్సవ పోస్టర్ ఆవిష్కరిస్తున్న మదర్సా బాధ్యులు

ఖమ్మం, ఫిబ్రవరి 14: ఖమ్మం సెయింట్ మెరీస్ పాఠశాల ఆవరణలో ఈ నెల 18న మదర్సా రుఖయ్య (ర.జి) బనాత్ రెండో వార్షికోత్సవం నిర్వహిస్తున్నట్లు మదర్సా కరస్పాండెంట్, ప్రిన్సిపాల్ ఇమామ్ ఏ ఖతీబ్ మస్జీదే అస్తబుల్ ముఫ్తీ అబ్దుల్ ఖాలిక్ సాహెబ్ తెలిపారు. వార్షికోత్సవ పోస్టర్‌ను మదర్సాలో బుధవారం ఆవిష్కరించి మాట్లాడారు.

ముగిసిన రోడ్డు భద్రతా వారోత్సవాలు

అవగాహన కల్పిస్తున్న ఇన్‌చార్జి డీటీవో

రఘునాథపాలెం, ఫిబ్రవరి 14 : జిల్లా రవాణాశాఖ ఆధ్వర్యంలో చేపట్టిన రోడ్డు భద్రతా వారోత్సవాలు బుధవారం ముగిశాయి. జిల్లా ప్రాంతీయ రవాణాశాఖ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఇన్‌చార్జి డీటీవో మహ్మద్ గౌస్‌పాషా మాట్లాడుతూ వాహనదారులకు పలు జాగ్రత్తలను వివరించారు. ఎంవీఐ వరప్రసాద్, సీనియర్ ఏవోలు జాహిద్ అలీ, సుధాకర్ పాల్గొన్నారు.

లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో నేత్రదానం

పెనుబల్లి, ఫిబ్రవరి 14: మండలంలోని లంకపల్లికి చెందిన నున్నా సూరయ్య అనారోగ్యంతో మృతిచెందారు. అతడి కుటుంబ సభ్యులకు లయన్స్‌క్లబ్ ఆఫ్ సప్తగిరి వీఎం బంజర బాధ్యులు నేత్రదానంపై అవగాహన కల్పించి వారి నేత్రాలను సేకరించి నేత్రనిధికు పంపించారు.

'ప్రమాదాల నివారణకు కవచంగా హెల్మెట్'

సమావేశంలో మాట్లాడుతున్న ఎంవీఐ

సత్తుపల్లి, ఫిబ్రవరి 14: వాహనదారులు రోడ్డు ప్రమాదాల నివారణకు హెల్మెట్ కవచంలా పనిచేస్తుందని సత్తుపల్లి ఎంవీఐ సంగం వెంకటపుల్లయ్య అన్నారు. నూతన డ్రైవింగ్ లైసెన్స్‌లు, రెన్యువల్‌లు, వాహన రిజిస్ట్రేషన్ కోసం కార్యాలయానికి వచ్చిన వారిత